క్లుప్తంగా

సబ్సిడీ దాణా పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలోని ఎస్సీ పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై శుక్రవారం సమీకృత దాణా పంపిణీ చేశారు. కొండపల్లి పశువైద్యశాలలో జరిగిన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 50 శాతం దాణా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యాధికారి స్వాతి అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

ఏజీపీగా ఏడీ ప్రసాద్

మైలవరం: మైలవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టుకు ప్రభుత్వం తరఫున కేసులు వాదించేందుకు సహాయ ప్రభుత్వ న్యాయవాది (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా ఏడీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఏజీపీ పీవీ సాంబశివరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు న్యాయవాదులు అభినందించారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్స్ అందజేత



మైలవరం: మైలవరం మండలం వెల్వడం ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు సిబ్బంది సౌజన్యంతో మూడు ల్యాప్‌టాప్‌లు, ఒక ప్రింటర్‌ను శుక్రవారం అందజేశారు. ఐడీబీఐ జనరల్ మేనేజర్ ఆర్.సతీష్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తమ బ్యాంకు తరఫున సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందజేశామని చెప్పారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్‌వి. సుధారాణి బ్యాంక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.చందన్, చంద్రాల బ్రాంచ్ మేనేజర్ పి.బంగారు బాబు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాకు లిబరేషన్ మద్దతు

నూజివీడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 2న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ఫ్యాప్టో పిలుపు మేరకు నిర్వహించే ధర్నాలకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పూర్తి మద్దతు ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందారన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తానని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57ను అమలు చేయాలన్నారు. దేశంలోని కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలు కేంద్ర నిర్ణయాన్ని అమలు చేశాయని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అమలుకు నోచుకోలేదని ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ బకాయిలను చెల్లించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఐఆర్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్ జిల్లాల బదిలీలను చేపట్టాలని హరినాథ్ డిమాండ్ చేశారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



షేక్ సమీరా

మైలవరం: సమాచార హక్కు 2005 అనే అంశంపై జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో మైలవరం డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థిని షేక్ సమీరా ద్వితీయ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శుక్రవారం తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆమెను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, మెండా దేవానందకుమార్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ బి. సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

బడ్డీకొట్టు దగ్ధం

మంగొల్లు(వత్సవాయి): ఎస్సీ కాలనీలోని బడ్డీకొట్టు అనుమానాస్పదంగా గురువారం రాత్రి అగ్నికి ఆహుతైంది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కర్లపూడి కుమారి ఎస్సీ కాలనీ వద్ద బడ్డీకొట్టు నడుపుకుంటోంది. గురువారం అర్ధరాత్రి బడ్డీకొట్టులో నుంచి మంటలు రావడంతో అప్రమత్తమై చూడగా.. అప్పటికే కొట్టులోని వస్తువులు అన్నీ కాలిపోయాయి. ప్రమాదవశాత్తూ కాలిందా, లేదా ఎవరన్నా కావాలని నిప్పు పెట్టారా అనే విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.35 వేల వరకు నష్టం జరిగిందని బాధితురాలు వాపోయారు.

ప్రభుత్వ వైద్యం.. అంతంతమాత్రం

- వైద్యం అందక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యానికి భరోసా
- ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలతో ఇంటివద్దకే వైద్యం
- కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శోభనాపురంలో వృద్ధుడికి మందుల కిట్ అందజేస్తున్న అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు (ఫైల్)

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్య సేవలను పొందేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందకుండా పోయాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు వైద్యులు తూతూ మంత్రంగా పరీక్షలు నిర్వహించి అందుబాటులో ఉన్న మందులను ఇచ్చి పంపించి వేస్తున్నారు. ఆగిరిపల్లి మండలంలోని గ్రామాలకు 104 వాహనం ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు రాదో తెలియని దుస్థితి నెలకొంది. వృద్ధులు, మంచం పట్టిన రోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వైద్యం, మందులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామీణులకు దూరమైన ఫ్యామిలీ డాక్టర్

గత ప్రభుత్వం 'ఆరోగ్య సురక్ష'లో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను సచివాలయాల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరిచేది. దాని ఆధారంగా విలేజ్ క్లినిక్‌లోని వైద్యులు బాధితులకు అవసరమయ్యే ఖరీదైన మందులను ఇంటి వద్దకు వెళ్లి ఎలా వాడాలో వివరించేవారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యానికి భరోసా

గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలకు ఎలాంటి వైద్యం అవసరమైనా పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ఇంటి వద్దకే ప్రభుత్వ డాక్టర్లు వచ్చేలా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్తగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారు. నిపుణులైన డాక్టర్లు గ్రామాల్లోకి వచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వైద్య పరీక్షలు చేసేవారు. వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా ఇచ్చేవారు. ఇంకా మెరుగైన వైద్య సేవలు అవసరం అనుకుంటే డాక్టర్ సిఫారసు మేరకు ప్రభుత్వమే కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్య సేవలను అందించేలా చర్యలు తీసుకునేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అనేక మంది పేదల ఆరోగ్యానికి భరోసా కలిగించింది.

కూటమి ప్రభుత్వంలో వైద్యం భారం

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మందులను గ్రామాలకు పంపడం లేదు. దీంతో వ్యాధిగ్రస్తులకు భరోసా కరువైంది. బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్, కిడ్నీ, క్యాన్సర్ జబ్బుల బాధితులు ఖరీదైన మందులు కొనాలంటే ప్రతి నెలా వేలల్లో ఖర్చు అవుతుంది. ఇది కుటుంబాలకు పెనుభారమే. మోతాదు ప్రకారం క్రమం తప్పకుండా మందులు వాడకుంటే జబ్బు ముదిరి తిరగబెట్టి ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తుతుంటాయి.

వైద్యం అందడం లేదు..



గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం గతంలో అందినంతగా ప్రస్తుతం అందడం లేదు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం లేదు. 104 వాహనం ద్వారా వైద్య సేవలను సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో వృద్ధులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో జగనన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించి అండగా నిలిచారు.

– బెజవాడ రాంబాబు, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు

అప్పట్లో వృద్ధులకు ఎంతో మేలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య శిబిరాలను నిర్వహించేవారు. గ్రామాలకు డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగానే ఇచ్చేవారు. ఆస్పత్రులకు వెళ్లలేని వృద్ధులకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య శిబిరాలు లేవు.

–షేక్ సుబాని, ఆగిరిపల్లి

కౌలు రైతులకు రుణాలివ్వాలి: ఆర్డీఓ



తిరువూరు: ఖరీఫ్ సీజన్ కౌలు రైతులకు కూడా రుణాలివ్వాలని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి బ్యాంకర్లకు సూచించారు. కౌలురైతుల రుణాలపై సమీక్షా సమావేశం శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, వ్యవసాయాధికారులతో నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నందున నిబంధనల మేరకు అర్హులందరికీ పంట రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. తిరువూరు డివిజన్‌లోని 74 గ్రామాల్లో గత ఏడాది 9,912 మందికి కౌలు రైతు కార్డులను జారీ చేయగా, ఈ ఏడాది మరో వెయ్యి మందికి కొత్త కార్డులు జారీ చేశారని, వ్యవసాయ శాఖాధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని కౌలు రైతులందరికీ రుణాలు అందే విధంగా కృషి చేయాలని ఆర్డీఓ సూచించారు.

ట్రై సైకిళ్లు అందజేత

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం సభ్యుడు బండి నరేష్ కుమారుడు రఘురాం పుట్టిన రోజు సందర్భంగా వెల్వడం గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు శుక్రవారం ట్రై సైకిళ్లను అందజేశారు. మైలవరం ఎస్వీఎస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్ పూర్వ గవర్నర్ లయన్ ఎస్వీఎస్ నివృతరావు, ప్రోగ్రామ్ కన్వీనర్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు చనుమోలు నాగభూషణం, సెక్రటరీ శీలం రామిరెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ విజయకుమారి



నూజివీడులో మాట్లాడుతున్న సీడీపీఓ విజయకుమారి

నూజివీడు: తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ పిల్లి విజయకుమారి అన్నారు. పట్టణంలోని బాపూనగర్ అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. తల్లిపాలు అన్ని పోషకాలను బిడ్డకు అందించి రోగాల నుంచి రక్షించే ఔషధమన్నారు. బిడ్డ పుట్టిన గంటలోనే తల్లిపాలను తాగించాలన్నారు. ఇవి శిశువును న్యుమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయని వివరించారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డతో పాటు తల్లికి కూడా ఉపయోగమని చెప్పారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

ఆగిరిపల్లి: పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు బలాన్ని ఇస్తాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జాస్తి జగన్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. బొద్దనపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్పటల్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

సీఐటీయూ నాయకుల డిమాండ్

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బోర్డు హాస్పిటల్ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులకు వైద్యశాలలో మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వం, జెన్‌కో యాజమాన్యం కాసులకు కక్కుర్తిపడి ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలకు వైద్య సేవలు దారాదత్తం చేయటం తగదన్నారు. నెలకు రూ.12 లక్షలు ప్రైవేటు హాస్పటల్‌కు చెల్లించడం బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ నిధులతో హాస్పటల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించవచ్చన్నారు. రిటైర్ ఉద్యోగులు కామేశ్వరరావు, నారాయణ, బాబ్జి, పాపయ్య పాల్గొన్నారు

ఆలయాల్లో శ్రావణ శోభ



తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు



ఆరుగొలనుపేటలో అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

తిరువూరు: శ్రావణ శుక్రవారం తిరువూరులోని పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రంగనాయకస్వామి దేవస్థానం, పాటి మీద దాసాంజనేయస్వామి దేవస్థానం, కోదండ రామాలయం, వేంకటాచలస్వామి దేవస్థానం, సంతోషిమాత ఆలయం, వాసవీమాత ఆలయం, కనకదుర్గాలయాల్లో సామూహిక కుంకుమపూజలు జరిగాయి. అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి భక్తులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చాట్రాయి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆరుగొలనుపేట లక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్లకు మహిళలు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు పంచామృత అభిషేకం, అలంకరణ, నిత్యపూజ, మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లే అవుట్ల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి

నూజివీడు: పట్టణ పరిధిలోని అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది జూన్ 30 తేదీ ముందు వేసిన అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గత నెల 26 నుంచి 90 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి గాను అపరాధ రుసుంతో పాటు 14 శాతం ఖాళీ స్థలం ఖరీదు చెల్లించినట్లయితే క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. 10 శాతం అపరాధ రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్స్ సర్వేయర్లతో అనధికార లేఅవుట్‌లలో ఉన్న స్థలాల ప్లాన్లను తయారు చేయించుకొని అపరాధ రుసుములో 50 శాతం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, మున్సిపల్ సిబ్బంది తనిఖీ అనంతరం మిగిలిన 50 శాతం అపరాధ రుసుం, 14 శాతం ఖాళీ స్థలం ఖరీదు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అనధికార లేఅవుట్లు వేసిన వారు ఆ లేఅవుట్‌లోని అన్ని ప్లాట్ల వివరాలను, లే అవుట్ స్కెచ్‌లను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అక్టోబర్ 25 లోగా అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోకపోతే భవిష్యత్‌లో ఆ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవని చెప్పారు. అమ్మకాలు, కొనుగోళ్లు జరగకుండా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల రిజిస్టర్‌లో నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఓపెన్ ఇంటర్ అధ్యయన కేంద్రంగా వీవీఆర్ కాలేజీ

మైలవరం: 2025–26 విద్యా సంవత్సరానికి ఏపీఓఎస్ఎస్ ఓపెన్ ఇంటర్మీడియెట్‌కు మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యయన కేంద్రం (ఏఐ)గా కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తమ కళాశాలకు ఉత్తర్వులు అందాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఈ ఏడాది ఆగస్టు 03 నాటికి 15 సంవత్సరాలు పూర్తయిన వారు ఓపెన్ ఇంటర్మీడియెట్ చదివేందుకు అర్హులని, గరిష్ఠ వయో పరిమితి లేదన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో కానీ, సెల్ 99665 53949 నంబర్‌ను కానీ సంప్రదించాలని కోరారు.

కొండపల్లిలో పారిశుద్ధ్య కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మైలవరం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు బిజిలి భవానీపై దాడి చేసిన టీడీపీ నేత ఉమామహేశ్వరరావును అరెస్ట్ చేయాలని కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఆమెపై దాడికి వ్యతిరేకంగా శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ గిరిజన మహిళను చులకన భావంతో దూషించి దాడి చేయడం దారుణమన్నారు. ఆమెకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మైలవరం కార్మికుల న్యాయబద్ధమైన సమ్మెకు కొండపల్లి మున్సిపల్ కార్మికుల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. యూనియన్ కార్యదర్శి జి.సురేష్, ఉపాధ్యక్షులు దేవుళ్లు, రమణ, కోశాధికారి కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణితంలో బోధనా సామర్థ్యాలు పెంపొందాలి

మైలవరం: గణితంలో బోధనా సామర్థ్యాలు పెంపొందాలని పలువురు ప్రొఫెసర్లు పేర్కొన్నారు. గణితంలో సమకాలీన అంశాలు, దాని అనువర్తనాలు అనే అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెష్‌మన్ ఇంజినీరింగ్ గణిత విభాగం ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి నిర్వహించారు. అధ్యాపక అభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయర్ లెర్నింగ్ నుంచి డాక్టర్ డి. కృష్ణ కిరణ్ వంశీ, తిరుచ్చి ఎన్ఐటీ నుంచి ప్రొఫెసర్ వి. లక్ష్మణ గోమతి నాయగం, హైదరాబాద్ క్యాంపస్‌లోని బిట్స్ పిలానీ నుంచి ప్రొఫెసర్ సంతను కోలే, రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించారు. ప్రొఫెసర్ సంతను కోలే తరంగ ప్రచారంలో సరిహద్దు విలువ సమస్యల అనువర్తనాన్ని వివరించారు. ఇది మహా సముద్రాల నుంచి విద్యుత్‌ను సృష్టించడానికి నమూనాలను నిర్మించడంలో ఉపయోగపడుతుందన్నారు. ఇండోర్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఘోష్ టాపస్ రాసిన స్వయం ప్రతిపత్తి, స్వయం ప్రతిపత్తి లేని వ్యవస్థల స్థిరత్వం అనే అంశం డైనమిక్ వ్యవస్థల స్థిరత్వాన్ని అంచనా వేయడానికి గణిత పద్ధతులను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్ రెడ్డి, ఫ్రెష్‌మన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

మునునూరు: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం మండల కేంద్రం ముసునూరులో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు గుాట్రు రంగారావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ముసునూరులోని రేగుల బ్రదర్స్ ప్రాంగణంలో విస్తృత స్థాయి సమావేశంలో నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని స్థాయిల ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

రేపు ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆగిరిపల్లిలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు పామర్తి నాగేశ్వరరావు ఇంటి ఆవరణలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

డీపీఓ లావణ్యకుమారి



వెంకటాపురం పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

జి.కొండూరు: వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య చర్యలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధి చెవుటూరు గ్రామంలో డీపీఓ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, ఇంటింటికి చెత్త సేకరణ, తాగునీటి శుద్ధి, మురుగు కాల్వల నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల పరిశుభ్రత వంటి అంశాలపై స్వచ్ఛ సర్వేక్షణ్ బృందంతో కలిసి డీపీఓ సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యుడు సుధీర్, డీపీఆర్సీ నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం

సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నరసింహ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరసింహ తదితరులు

చాట్రాయి: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యవతిరేకిద్దామని సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఆ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేసిందని విమర్శించారు. అప్పట్లో స్మార్ట్ మీటర్లను వ్యవతిరేకించిన టీడీపీ ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయకుండా రానున్న రోజుల్లో వామపక్ష పార్టీలతో పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడతామని చెప్పారు. ఈ నెల 5న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కొమ్ము ఆనందం, ఈవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో డీవైఈఓ విచారణ

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల ఆకతాయి ఘటనలకు సంబంధించి శుక్రవారం నందిగామ డివిజన్ డీవైఈఓ డి. సాంబశివరావు పాఠశాలలో విచారణ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నడవడిక పట్ల ఉపాధ్యాయులు పర్యవేక్షణ తప్పక ఉండాలని, తేడా ఉంటే వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. పాఠశాలకు వచ్చిన తర్వాత విద్యార్థులను పర్యవేక్షించడంతో పాటు చెడు నడత ఉన్నవారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జరిగిన ఘటనలకు సంబంధించి విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. పాఠశాలలో టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు డీవైఈఓ దృష్టికి తీసుకురాగా వెంటనే టీసీలు ఇప్పించాలని ఉపాధ్యాయులు, సిబ్బందిని ఆదేశించారు. ఎంఈఓ రవీంద్ర, హెచ్ఎం కె. జలజ పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డును వినియోగంలోకి తీసుకురావాలి

నందిగామ టౌన్: కూటమి అధికారంలోకి రాగానే వెల్ఫేర్ బోర్డును వినియోగంలోకి తీసుకువస్తామని, భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందిస్తామని చెప్పిన నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పథకాల ఊసెత్తటం లేదని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లి నరసింహారావు, అప్పారావు పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని మంత్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే సెప్టెంబర్ 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటేశ్వరరావు, కటారపు గోపాల్, షేక్ హుస్సేన్, సుభానీ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



నూజివీడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి ప్రయాణించాలని పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో శుక్రవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వాహన చోదకులను ఆపి వారికి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ ధరించడం వల్ల గమ్యస్థానానికి సురక్షితంగా చేరతారని, ఒకవేళ అనుకోకుండా ప్రమాదం సంభవించినా హెల్మెట్ ఉండటం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని చెప్పారు. కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. దీనివల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దని, అతివేగం ప్రమాదమని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై తక్షణమే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.